క్లుప్తంగా

ఆలయానికి ఆర్‌ఓ ప్లాంట్ అందజేత



ఆలయంలో ఆర్‌ఓ వాటర్‌ప్లాంట్ అందిస్తున్న వాసవి వనిత క్లబ్ సభ్యురాళ్లు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక చిన్న కూరగాయల మార్కెట్ వద్ద ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తుల తాగునీటి సౌకర్యార్థం స్థానిక వాసవి వనిత క్లబ్ సభ్యులు ఆర్‌ఓ వాటర్ ప్లాంట్‌ను అందించారు. శుక్రవారం ఆలయంలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను వనిత క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కొర్లేపర కృష్ణాజి దంపతులు ప్రారంభించారు. అనంతరం ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ జోగి వెంకటేశ్వరరావు కృష్ణాజి దంపతులను స్వామి వారి శేషవస్త్రంతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణాధికారి ముచ్చర్ల శ్రీనివాస్, ట్రస్ట్ బోర్డు సభ్యులు పెచ్చెట్టి శరత్ చంద్ర, కెల్లా సుబద్ర, క్లబ్ అధ్యక్షురాలు చిదెళ్ల మహాలక్ష్మీ, సెక్రటరీ బొండాడ వినయకుమారి, ట్రెజరర్ తోట వారిజాలిల్లి, ఆలయ అర్చకులు కృష్ణ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ శామ్యూల్ బాబు కుటుంబానికి ఆర్థిక సాయం

పోడూరు: పెనుమదం శివారు రాజులగరువు గ్రామానికి చెందిన పాస్టర్ తవిటికి సామ్యూల్ బాబు ఇటీవల మృతి చెందారు. పోడూరు మండల యునైటెడ్ పాస్టర్స్ అసోసియేషన్(యూపీఏ) అధ్యక్షులు రెవరెండ్ జీఎస్‌కుమార్, సభ్యులు శుక్రవారం పాస్టర్ శామ్యూల్‌బాబు కుటుంబసభ్యులను పరామర్శించి రూ.20 వేల ఆర్థికసాయం అందజేశారు. అలాగే హెల్పింగ్ హ్యాండ్స్ పాస్టర్స్ కూడా ఆయన కుటుంబాన్ని పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. క్రైస్తవ నాయకులు బిషప్ మల్లిపూడి జోహాన్నస్ ప్రేమ్‌కుమార్, యూపీఏ మాజీ అధ్యక్షులు రెవ.గెద్దం సామ్యేల్ జాన్సన్, కోశాధికారి వై.కిషన్‌కుమార్ శామ్యూల్‌బాబు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పదో తరగతి విద్యార్థి మిస్సింగ్



రామ్‌తేజ

పాలకొల్లు సెంట్రల్: పదో తరగతి ఫెయిల్ అవ్వడంతో శుక్రవారం ఓ విద్యార్థి ఇంటి నుంచి వెళ్లిపోయాడని అతడి తండ్రి పోలీసులను ఆశ్రయించాడు. విద్యార్థి తండ్రి వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక దేశాలమ్మ గుడి వద్ద చింతల తోట ప్రాంతంలో నివాసం ఉంటున్నామని, తమ కుమారుడు రామ్‌తేజ ఇటీవల వెలువడిన పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో ఫెయిల్ అవ్వడంతో సప్లిమెంటరీకి రాసాడు. శుక్రవారం ఉదయం పదో తరగతి సప్లిమెంటరీ ఫలితాలు వెలువడ్డాయి. మధ్యాహ్నం 12 గంటల వరకూ ఇంటి వద్దే ఉన్న రామ్‌తేజ ఫలితాలు చూసుకుని వస్తానని చెప్పి ఇంటి నుండి బయటకు వెళ్లాడు. మళ్లీ ఫెయిల్ అవ్వడంతో రామ్‌తేజ్ తన తల్లి నాగమణికి ఫోన్ చేసి విషయం చెప్పాడు. సరేలే ఇంటికి వచ్చాకా మాట్లాడదాము రమ్మని తల్లి చెప్పింది. తేజ ఎంతసేపటికీ ఇంటికి రాకపోవడంతో పట్టణంలో బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మహిళకు ఆర్థిక సాయం

పాలకొల్లు సెంట్రల్: అనారోగ్యంతో బాధపడుతున్న మహిళకు వసుధ ఫౌండేషన్ ఆర్థిక సహాయం అందజేసింది. శుక్రవారం విజయ ల్యాబ్ అధినేత కొమ్ముల మురళీకృష్ణ మాట్లాడుతూ మండలంలోని మేడపాడు గ్రామానికి చెందిన కూనపురెడ్డి మణికుమారి గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తన దృష్టికి రాగా ఈ విషయాన్ని వసుధ ఫౌండేషన్ సభ్యులకు తెలియజేస్తున్నామన్నారు. వెంటనే స్పందించిన ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట రామరాజు బాధితురాలికి రూ.10 వేలు చెక్కును ఏర్పాటు చేశారని తెలిపారు. చెక్కును బాధితురాలి భర్త, కుమార్తెకు కొమ్ముల మురళీకృష్ణ, ఫౌండేషన్ కన్వీనర్ పెన్మెత్స బుద్ధరాజు, పెన్మెత్స జగపతిరాజు అందజేశారు.

‘జగనన్న సురక్ష’ను విజయవంతం చేయాలి

చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో విజయవంతం చేయాలని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు సూచించారు. శుక్రవారం మున్సిపల్ కౌన్సిల్‌హాల్‌లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ముందుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన కార్యక్రమాన్ని టీవీలో వీక్షించారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో నిర్వహించిన సమావేశంలో ముదునూరి మాట్లాడుతూ ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకోవడం, ఇంకా సమస్యలుంటే వాటిని సత్వరం పరిష్కరించడం ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవతంతం చేయాలన్నారు. జూలై 1 నుంచి సచివాలయాల వద్ద ప్రత్యేక క్యాంపులు కూడా నిర్వహిస్తారని చెప్పారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో అందించే సేవలపై ప్రజల్లో వివిధ మాధ్యమాల ద్వారా విస్తృత అవగాహన కల్పించాలని చెప్పారు.

ఉచితంగా సర్టిఫికెట్ల జారీ

జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా పలు రకాల సర్టిఫికెట్లను ఎలాంటి చార్జీలు లేకుండా ఉచితంగా అందిస్తారని చెప్పారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, భూముల వివరాలు ఆన్‌లైన్ చేయడం, కౌలు గుర్తింపు కార్డులు, కొత్త రేషన్ కార్డులు, ఆధార్ కార్డుల్లో మార్పులు వంటి సేవలు ఉచితంగా అందిస్తారన్నారు. మ్యుటేషన్ సర్టిఫికెట్‌లు, పాస్‌బుక్‌ల జారీకి స్టాంప్ డ్యూటీ చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. ప్రజలకు మంచి సేవలు అందించడానికి అధికారులు సిద్ధంగా ఉండాలని చెప్పారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, వైస్ చైర్మన్ కొత్తపల్లి నాని, మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ గుబ్బల రాధాకృష్ణ పాల్గొన్నారు.



జగనన్న సురక్ష ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు



యర్రంశెట్టిపాలెంలో జగనన్న సురక్ష బ్రోచర్లతో నాయకులు, సచివాలయ సిబ్బంది



పాలకొల్లు ఏఎంసీ ఆవరణలో విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు



మేడపాడులో సీఎం జగన్ ప్రసంగాన్ని వీక్షిస్తున్న నాయకులు, వలంటీర్లు

యర్రంశెట్టివారిపాలెంలో..

నరసాపురం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ధ్రువీకరణ పత్రాలను త్వరితగతిన అందించేందుకు అధికారులే గ్రామాల బాట పట్టనున్నారని సర్పంచ్ యర్రంశెట్టి నాగముత్యమాంబ అన్నారు. శుక్రవారం యర్రంశెట్టివారిపాలెం గ్రామ సచివాలయంలో నిర్వహించిన జగనన్న సురక్ష అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. వలంటీర్లు, గృహ సారథులు, కన్వీనర్లకు విధివిధానాల గురించి కార్య దర్శి రఘురాం తదితరులు అవగాహన కల్పించారు.

పాలకొల్లులో..

పాలకొల్లు అర్బన్: జగనన్న సురక్ష పథకంతో ప్రతీ ఇంటికీ లబ్ధి చేకూర్చే కార్యక్రమానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలివ్వడం హర్షణీయమని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కుంచిలపల్లి విన్సిటన్‌బాబు అన్నారు. పాలకొల్లు ఏఎంసీ సమావేశ మందిరంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ప్రతీ ఇంటినీ సందర్శించి వారికి అవసరమైన ధ్రువీకరణ పత్రాలన్నీ ఉచితంగా జారీ చేయనున్నట్లు వివరించారు. సమావేశంలో పార్టీ మండల కన్వీనర్ ఎం.మైఖేల్‌రాజు, మండల సచివాలయ కన్వీనర్ పార్శి వెంకటరత్నం, పార్టీ నాయకులు ఏనుగుపల్లి చంద్రశేఖర్, తరపట్ల ప్రవీణ్, దేవ రాజేష్‌కుమార్, ఊటాల చిట్టిరాజు, భావన సునీల్, నల్లి జయరాజు, బుంగ జయరాజు, సాలా శ్రీను పాల్గొన్నారు.

మేడపాడులో...

యలమంచిలి: వలంటీర్లు, సచివాలయ సిబ్బంది జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మేడపాడు వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు, స్థానిక సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ గుర్రాల వెంకట్రావు కోరారు. జగనన్న సురక్ష ప్రారంభ కార్యక్రమాన్ని శుక్రవారం మేడపాడు సచివాలయంలో స్థానిక నాయకులు, సచివాలయ ఉద్యోగులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు కలసి వీక్షించారు. ప్రారంభ కార్యక్రమం పూర్తయిన అనంతరం వెంకట్రావు మాట్లాడుతూ దేశ చరిత్రలో ఇంతవరకు ఎవరూ చేపట్టనటువంటి మంచి కార్యక్రమం జగనన్న సురక్ష అన్నారు. సర్పంచ్ గంటా శాంతకుమారి, ఎంపీటీసీ సభ్యురాలు డేగల సూర్యప్రభ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ వర్గాలకు పని దినాలు పెంచాలి



మోడి గ్రామంలో చెరువును పరిశీలిస్తున్న డిప్యూటీ కమిషనర్ సీహెచ్ భవాని

మొగల్తూరు: మొత్తం పని దినాల్లో సగం పైబడి పని దినాలు ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు కేటాయించాలని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి డిప్యూటీ కమిషనర్ సిహెచ్ భవాని ఆదేశించారు. శుక్రవారం ఆమె మొగల్తూరు పంచాయతీ పాలకమ్మ చెరువు, పేరుపాలెం నార్త్, మోడి గ్రామాల్లో పర్యటించారు. మొగల్తూరు పంచాయతీ పాలకమ్మ చెరువులో గ్రామస్తులతో మాట్లాడారు. మీ గ్రామంలో 364 జాబ్ కార్డులు అందిస్తే కేవలం 100 మంది మాత్రమే వినియోగించుకుంటున్నారని, మిగిలిన వారు ఎందుకు రావడం లేదు? అని ప్రశ్నించారు. మోడి, పేరుపాలెం నార్త్ గ్రామాల్లో అమృత్ సరోవర్ పథకంలో చేపట్టిన చెరువు తవ్వకం పనులు పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ మీకు ఖాళీగా ఉన్న భూముల్లో ఉద్యాన పంటలు వేసుకుంటే ఉపాధి హామీ పథకంలో మూడు సంవత్సరాలు పాటు తోడ్పాటును అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నీటియాజమాన్యం పీడీ ఎస్‌టీవీ రాజేశ్వరరావు, మండల పరిషత్ ప్రత్యేకాధికారి వి.వి జయలక్ష్మి, మొగల్తూరు సర్పంచ్ పడవల మేరీ, ఎంపీడీఓ వి.బాబ్జిరాజు, ఈఓపీఆర్డీ నవీన్ కిరణ్, ఈసీ ఆనంద్ పాల్గొన్నారు.

రూ.80 లక్షలతో ఆర్టీసీ డిపో గ్యారేజ్ అభివృద్ధి



ఆర్టీసీ డిపో గ్యారేజ్‌ను పరిశీలిస్తోన్న ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం: నరసాపురం ఆర్టీసీ డిపో గ్యారేజ్‌ను ఆధునికీకరించడానికి ప్రభుత్వం ఇటీవల రూ.80 లక్షలు మంజూరు చేసింది. అభివృద్ధి పనులను ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి పరసాదరాజు శుక్రవారం భూమిపూజచేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ బస్టాండ్, డిపో మొత్తం ఆధునికీకరించడానికి రూ.4.80 కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. అవసరమైతే మరిన్ని నిధులు తీసుకొస్తామని చెప్పారు. పురాతనమైన నరసాపురం ఆర్టీసీ డిపో గత పాలకుల నిర్లక్ష్యంతో అభివృద్ధికి నోచుకోకుండా పోయిందన్నారు. అందుకే ముందుగా రూ 4 కోట్లతో బస్టాండ్‌ను ఆధునికీకరించి, ఇప్పుడు డిపోను అభివృద్ధి చేస్తున్నామన్నారు. బస్టాండ్ ఎదురుగా రోడ్డు పక్కన కాలువపై కాలిబాట వంతెనను కాటన్ పార్కుకు అనుసంధానంగా నిర్మిస్తున్నామని చెప్పారు. ప్రయాణికులు అవసరమైతే పార్కులోకి కూడా వెళ్లి సేద తీరవచ్చని చెప్పారు. ఈ పనులు రెండు నెలల కాలపరిమితో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. బస్టాండ్ భవనంపైన రెస్టారెంట్ ఏర్పాటుకు టెండర్లు పిలవాలని చెప్పారు. నరసాపురం నుంచి విజయవాడకు బస్సు సర్వీస్ వెంటనే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రద్దయిన దూర సర్వీసులను కూడా తిరిగి పునరుద్ధరించి, నరసాపురం డిపోకు పూర్వ వైభవం తీసుకొస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, కౌన్సిలర్లు బర్రి జయరాజు,వైకేఎస్, ద్వారా ప్రసాద్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బూసరపు జయ, కోటిపల్లి దొరయ్య, డిపో మేనేజర్ ఎస్ సుబ్బన్నరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దళితుల పేరుతో రాజకీయాలొద్దు



మేడపాడులో మాట్లాడుతున్న హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పెదపాటి పెద్దిరాజు

యలమంచిలి: దళితుల పేరుతో రాజకీయాలు చేయడం తెలుగుదేశం నాయకులకు పరిపాటిగా మారిందని హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పెదపాటి పెద్దిరాజు విమర్శించారు. మేడపాడు జగనన్న కాలనీలో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చించినాడ పెరుగులంక భూమి పూర్తిగా ప్రభుత్వానికి చెందినదన్నారు. ఆ భూమిలోని తువ్వ ఇసుకను కలెక్టర్ అనుమతితో గృహ నిర్మాణ శాఖ, గనుల శాఖ, రెవెన్యూ శాఖ పర్యవేక్షణలో జగనన్న కాలనీలకు తోలుతుంటే పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు దానిని కూడా రాజకీయం చేయడం సిగ్గు చేటన్నారు. స్థానిక సీపీఎం నాయకులకు అది పూర్తిగా ప్రభుత్వ భూమని తెలిసినా వారు కూడా దళితుల భూమి అంటూ నిరసనలు, దీక్షలు చేయడం గర్హనీయమన్నారు. డీఫామ్ పట్టా భూముల్లో కాయకూరలు, పశుగ్రాసం మాత్రమే సాగు చేయాలన్నారు. కానీ అక్కడ పట్టా భూముల్లో ఆక్వా చెరువులు తవ్వుతుంటే అప్పుడు ఈ సీపీఎం నాయకులంతా ఏం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. పట్టా భూములు అమ్మడం, తనఖా పెట్టడం నేరమని ఈ విషయంలో ఎస్సీ కమిషన్ ఆధ్వర్యంలో ఆ భూములపై విచారణ చేసి, చేతులు మారాయని నిర్ధారణ అయితే పాత పట్టాలను రద్దు చేసి కొత్తగా అర్హులను గుర్తించి వారికి పట్టాలు ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని పెద్దిరాజు చెప్పారు. మేడపాడు సొసైటీ అధ్యక్షుడు గుర్రాల వెంకట్రావు, ఎంపీటీసీ సభ్యురాలు డేగల సూర్యప్రభ, అడవిపాలెం వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బుంగా జయరాజు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ ఉచిత కుళాయి



దగ్గులూరులో రూ.2.68కోట్ల జలజీవన్ మిషన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్

పాలకొల్లు అర్బన్: ప్రతి ఇంటికీ ఉచిత కుళాయి అందించడంతో పాటు మంచినీటి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించనున్నట్లు వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ వెల్లడించారు. పాలకొల్లు మండలం దగ్గులూరులో జలజీవన్ మిషన్ నిధులు రూ.2.68 కోట్లతో విస్తరించనున్న పైపులైన్ పనులకు శుక్రవారం ఎమ్మెల్సీ శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ఈ నిధులతో మండలంలోని దగ్గులూరుతో పాటు ఆగర్తిపాలెం, కొత్తపేట, గవరపేట, పాలమూరు గ్రామాలకు పైపులైన్ విస్తరణ, ఓహెచ్‌ఎస్‌ఆర్ నిర్మాణం, సంపులు, ఇతర మరమ్మతుల పనులు చేపట్టనున్నట్లు శ్రీనివాస్ వివరించారు. పనుల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించి నిర్ణీత గడువులోపు పనులు పూర్తి చేసి ప్రజలకు మంచినీరు అందించాలని కోరారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు అభివృద్ధి పనులకు సమాన ప్రాధాన్యత ఇచ్చి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని కోరారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో జగన్‌మోహన్ రెడ్డిని మరలా సీఎం చేయాలని కోరారు. ఈ సందర్భంగా దగ్గులూరు మంచినీటి చెరువుగట్టు వద్ద ఏర్పాటుచేసిన శిలాఫలకాన్ని ఎమ్మెల్సీ శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చిట్టూరి కనకలక్ష్మి, జడ్పీటీసీ నడపన గోవిందరాజులనాయుడు, చింతలపూడి పార్టీ పరిశీలకుడు గుణ్ణం నాగబాబు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, పార్టీ మండల కన్వీనర్ ఎం మైఖేల్‌రాజు, మండల పరిషత్ మాజీ ప్రతిపక్షనేత చిట్టూరి ఏడుకొండలు, సర్పంచ్‌లు విశ్వనాథం కనకభద్రం, పోలిమేర వెంకటేశ్వరరావు, కవురు భాస్కరబాబు, కెల్లా సింహాచలం, ఎంపీటీసీ సభ్యుడు శాగా సత్యనారాయణ, గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేటి సూర్యనారాయణ, పార్టీ నాయకులు పణతుల చంటి, పణతుల వీరాస్వామి, విశ్వనాథం పేరయ్య తదితరులు పాల్గొన్నారు.

తూర్పు కాపుల రిజర్వేషన్లపై హద్దులు తొలగించాలి



కేంద్ర మంత్రి భారతి ప్రవీణ్ పవర్‌కు వినతిపత్రం అందిస్తున్న తూర్పుకాపు సంఘు నాయకులు

పాలకొల్లు సెంట్రల్: రాష్ట్రంలో తూర్పుకాపులకు ఓబీసీ రిజర్వేషన్లపై హద్దులు తొలగించి అన్ని జిల్లాలకు వర్తించేలా కృషి చేయాలని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి భారతి ప్రవీణ్ పవర్‌కు తూర్పుకాపు సంఘ సభ్యులు గురువారం వినతిపత్రం అందజేశారు. శుక్రవారం సంఘ సభ్యులు లోపింటి చిరంజీవి విలేకరులతో మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎన్‌సీబీసీ కమిషన్ కోరిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో విద్యా సంవత్సరం ప్రారంభమైందని విద్యార్థులు ఓబీసీ సర్టిఫికెట్ లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. త్వరితగతిన సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో మీసాల రాము, పిల్లా సత్తిబాబు, సామంతుల అప్పారావు, పాట్నూరి రమేష్, చీరా సత్తిబాబు, దేవి కిషోర్, భాకూరి నిరంజన్, ధనాని ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొట్టడంతో విరిగిన విద్యుత్ స్తంభం



లారీ ఢీకొనడంతో విరిగిపోయి లారీపై పడిన విద్యుత్ స్తంభం

పెనుగొండ: మండలంలోని సిద్ధాంతం కేదారేశ్వరస్వామి ఆలయం ఎదురుగా ప్రధాన రహదారి మార్గంలో రావులపాలెం నుంచి పెనుగొండ వైపు అధికలోడుతో వెళుతున్న లారీ రహదారి పక్కనున్న 11కేవీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విద్యుత్ స్తంభం విరిగిపోయి లారీలోడుపై పడింది. స్థానికులు సకాలంలో స్పందించి విద్యుత్ సిబ్బందికి సమాచారమివ్వడంతో విద్యుత్‌శాఖ సిబ్బంది సరఫరా నిలిపివేశారు. ఈ ప్రమాదంలో అదృష్టవశాత్తూ ఎవరికీ ఏమీ కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. రోడ్డుకు అడ్డంగా లారీ నిలిచిపోవడంతో ఇరువైపులా పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోయి కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది.

నేడు మొగల్తూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

మొగల్తూరు: స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని శనివారం స్థానిక వేంకటేశ్వర కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వి.బాబ్జిరాజు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండల పరిషత్ సమావేశ మందిరాన్ని మరమ్మతులు చేస్తున్న దృష్ట్యా కల్యాణ మండపంలో సమావేశాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఎంపీపీ అందే సూర్యావతి అధ్యక్షతన జరిగే సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీటీసీ సభ్యుడు, అన్ని శాఖల అధికారులు పాల్గొనాలని ఆయన కోరారు.

లేసుపార్కులో ఉచిత శిక్షణ తరగతులు

నరసాపురం రూరల్: కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన పథకం ద్వారా అందించనున్న ఉచిత శిక్షణలను వినియోగించుకోవాలని లేసు పార్కు మేనేజర్ డి.వెంకటేశ్వరరావు, ఎన్ఏసీ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.వసంతరావు పేర్కొన్నారు. ఆంధ్ర ప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్ఏసీ)ల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్న శిక్షణకు లబ్ధిదారుల ఎంపిక కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. నరసాపురం మండలం సీతారాంపురం లేసుపార్కులో 60 మంది ఔత్సాహిక మహిళలకు రెండు బ్యాచ్‌లుగా కుట్టు మిషన్, హ్యాండ్ ఎంబ్రాయిడరీలపై శిక్షణను ఇవ్వనున్నట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో లేసు పార్కు అధ్యక్షురాలు పులపర్తి మహాలక్ష్మి, పాలంకి రమేష్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

పాలకొల్లు అర్బన్: మండలంలోని వెలివెలలో శుక్రవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల గ్రామానికి చెందిన పిడకల సురేష్ బాబు (24) మృతి చెందాడు. మృతుడు సురేష్‌బాబు ఓ రైతుకి చెందిన రొయ్యల చెరువుపై పనిచేస్తున్నాడు. జనరేటర్ ఆన్ చేస్తుండగా ప్రమాదం జరిగి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు అన్నయ్య నరేంద్రబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాసరావు తెలిపారు.